
# పంకజం

కొడూరి కౌసల్యాదేవి

"డెబ్బై రూపాయలు కావాలి నాకు"

"ఎందుకు?" వ్రాసుకుంటున్న శ్రీధర్ తలెత్తకుండానే అడిగాడు.

"ఆడవాళ్ళకూడా ఖర్చులుంటాయి. అవసరాలనుగుర్తించి యివ్వాలికాని అణాపైసల దగ్గర్నుంచీ ఆరాలు తీయడమేమిటి?" విసుగ్గా వెళ్ళి కిటికీదగ్గర నిల్చుంది పంకజం.





వ్రాత ఆపుజేసి సాలోచనగా అటు చూచాడు శ్రీధర్. "అవసరమేమిటీ- అన్నాను కానీ అవసర ముండదనలేదు పంకజా. ఏమైనా రహస్యమా?"

అసలేకోపంగా వున్న పంకజ వదనం మరింత కోపంతో అరుణిమ దాల్చింది. "ఎగతాళి అనవసరం. రహస్యమేమిటి మీ దగ్గర? నా స్నేహితురాలు నిర్మల పెళ్ళి. అందుకు"

"అయితే ఏకంగా డెబ్భైలూ, ఎనభైలూ దేనికి? మరీ అంత ముఖ్య స్నేహితురాలు కాదేమో? అంత విలువైన బహుమతి యివ్వాలా?"

"ముఖ్యురాలు కాకపోయినా కావలసినదే పాతిక ముప్ఫైలో ఏదైనా బహుమతీ, మిగిలినవి ప్రయాణం ఖర్చులు."

ఒక్క-క్షణం మాట్లాడలేదు శ్రీధర్. "అయితే యిలా అడగడంలో నీ వుద్దేశ్యమేమిటి పంకజా? మన ఆదాయవ్యయాల సంగతి నీకు తెలియనిది కాదుగా?" అన్నాడు కడకు నెమ్మదిగా.

"నేను డబ్బు అడిగినప్పుడల్లా యిలా ఆదాయవ్యయ పట్టిక ఏకరువు పెట్టడంతో

మీ వుద్దేశ్యమేమిటి? మన జీవితాంతం ఈ సమస్య వుండేదే. స్నేహితురాలి పెళ్ళి మాత్రం ఒక్కసారే వస్తుంది." పంకజం కంఠస్వరం తీవ్రంగా వుంది "నా కా సమస్యలన్నీ అనవసరం."

అదొకమాదిరిగా తలపంకిస్తూ నవ్వాడు శ్రీధర్. "నాకు పరిస్థితులు అర్థమయ్యే వరకూ బోధించవలసిందే. నువ్వనవసర మన్నంత మాత్రాన వదలిపోవు మన పరిస్థితుల కనుగుణంగా మనం నడచు కోవాలికాని-గగన కుసుమాలను ఊహా లోకంలో దండగ్రుచ్చటం వరకే- ఆ మాల మన కంఠాన్నలంకరించడం- ఈ ధోరణిలో అసాధ్యం."

ఆశ్చర్యంగా యిటుతిరిగింది పంకజం "దెబ్బైరూపాయలు అడగడం అందరాని ఫలాన్నాశించడమే నన్న మాట! అంత మాత్రానికూడా నోచుకోలేదా నేను?"

పరీక్షగా చూచాడు శ్రీధర్. "వంట గదిలో అమ్మతోగానీ యేమైనా ఘర్షణ పడి వచ్చావా? ఏదో ఆవేశంలో వున్న ట్టున్నావ్?"

"అవును అణగి మణగి పడే వాళ్ళుంటే మీ అమ్మా చెప్తారు, మీరూ చెప్తారు. ఇంతకూ యిస్తారా,యివ్వరా?"

శ్రీధర్ ఓర్మి నశించింది. "ఇవ్వనన దం కాదు పంకజా. ఈ రెండువందల యాభై జీతగాడు నీ ఆర్థికావసరాలు, విలాసాలు తీర్చలేడు. మొన్ననేకదా మీ చెల్లెలి పెళ్ళికి, ఏ విధంగా వైతేనేం మూడు వందలు ఖర్చయ్యాయి. అందు కేమీ అనను, అది చాలా ముఖ్యం కాని అవసరమైనవీ కానివీ అన్నీ తట్టుకో లేను. ఓ యిరవై-పాతికలో యేదైనా బహుమతి పంపించు. నువ్వు వెళ్ళక్క ర్లేదు"

"నా స్నేహితురాలి పెళ్ళికి నేను వెళ్ళాలో అక్కర్లేదో నాకు తెల్సు..."

అంతలో మూడేళ్ళ కొడుకు రఘు అటుగా రావడంతో సంభాషణ ఆగింది.

"అమ్మా! ఎత్తుకో," చేతులు చాపుతూ ముందుకు వెళ్ళాడు.

"పోయి ఆడుకో లేకపోతే మామ్మ నెత్తుకోమను" విసుగ్గా అంది పంకజం.

బిక్కముఖంతో నిల్చున్న రఘును శ్రీధర్ ఎత్తుకున్నాడు "మన చికాకులు, సమస్యలు పిల్లలకు తెలియకూడదు. సరే, నువ్వడిగినదానికి నా శక్తీ, సలహాలు వివరించాను. ఆ పైన నీ యిష్టం." రఘును లాలిస్తూ బయటకు వెళ్ళి పోయాడు శ్రీధర్.

మర్నాడు రైలుకు ప్రయాణమౌతున్న భార్యదగ్గర కొచ్చాడు శ్రీధర్. "అయితే నీపంతం విడువవన్నమాట. వెళ్ళటానికే నిశ్చయించుకున్నావా?"

"మీ డబ్బేమీ యివ్వక్కర్లేదులెండి. బాధపడకండి."

"ఓ! మీ, మా - చాలా దూరం పోయావు. అయితే డబ్బెక్కడిదో తెల్సు కోవచ్చా?"

"వుంగరం అమ్మేశాను." ముక్తసరిగా అంది పంకజం

వులిక్కిపడ్డాడు శ్రీధర్. "ఏ వుంగరం?"

"నాకున్న దొక్కటే వుంగరం."

షాక్ తిన్నట్లయ్యాడు శ్రీధర్ "పెళ్ళి నాడు నేను స్వయంగా నీ వ్రేలికి తొడిగినదా? అ దమ్మడానికి నీకు చేతులెలా వచ్చాయి? అంతో యింతో చదువుకున్న దానవు కూడాను! తెల్సుకొంటే ఆనాడు నేను కట్టిన మంగళసూత్రమంత విలువైనదీని ఆ వుంగరం," ఆ మాటలలో ధ్వనిస్తున్న వ్యధను పంకజం ఏ మాత్రమూ గుర్తించలేదు. పెట్టె తాళం వేసివస్తూ "మంగళ సూత్రాలను, జందెపు పోగులను పూజించే కాలం కాదిది.ఇన్ని విలువలు తెలిసిన మీకు నా కోర్కె విలువ తెలియకపోయిందా?" జవాబుకు ఎదురు చూడకుండానే వెళ్ళిపోయింది.

## 2

రాత్రి తీరికగా వాలుకుర్చీలో పడుకుని కొడుకును గుండెలపై కూర్చోబెట్టుకుని కబుర్లు చెప్తున్నాడు శ్రీధర్.కొంత సేపటికి పంకజం వచ్చింది గదిలోకి. "మామ్మ పిలుస్తున్నారు రఘూ వెళ్ళి పడుకో."

"నిద్దల లాటం లేదమ్మా." ఆ నత్తి మాటలకు ముద్దుపెట్టుకుంటూ లేవదీసి రఘును అత్తగారికిచ్చి తిరిగి వచ్చింది పంకజం.

శ్రీధర్ కు దగ్గరగా ఒక కుర్చీ లాక్కుని కూర్చుంది.

కొద్దిసేపు ఎవరూ మాట్లాడలేదు. మెల్లగా పంకజం సంభాషణ కుపక్రమించింది. "నేను ఉద్యోగంచేస్తే మీకేమైనా అభ్యంతరమా?"

ఆ ప్రశ్నకు శ్రీధర్ చలిస్తాడని భావించింది పంకజం, కాని అతడి ముఖ కవళికలలో ఆమెకేమీ మార్పు ద్యోతకమవ్వలేదు.

నిజానికి శ్రీధర్ చలించాడు. ఊహించని ఆ ప్రశ్న వినగానే వర్ణించరానంతగా అతడి మనోహృదయాలు కదలిపోయి చాలసేపు స్థాణువులా వున్నట్లే వుండిపోయాడు. కడకు మందస్వరంతో అడిగాడు. "అయితే నీ కభ్యంతరం లేనట్టేనా?"

"లేదు గనుకనే ఆ నిశ్చయాని కొచ్చాను."

"ఇన్నాళ్లూ లేని ఆలోచన నీ కిప్పుడెందుకు కలిగింది?"

"మీకు తెలియదా? నా అవసరాలకు ఒకరిపై ఆధారపడకుండా వుండటానికి"

"అవసరాలు - అనకు, అవసరం. ఆర్థిక అవసరం ఒకటే తీరుతుంది వుద్యోగంవల్ల."

"........

"అయినా నువ్వు పాసైంది యింటర్మీడియెట్; అదీ 'ఆర్ట్స్' గ్రూప్‌తో. మహావస్తే ఓ డెబ్భై,తొంభై రూపాయల

కంటె ఎక్కువ రాదు. అదైనా అతి ప్రయత్నంమీద. గ్రాడ్యుయేట్స్‌కే అతీ గతీ వుండడంలేదు.''

''ఫర్వాలేదు అంతేచాలు. ఉద్యోగం నేను సంపాదించుకోగలను. ప్రయత్నిస్తే మార్గమే వుండకపోతుందా ?''

''అయితే అన్నీ ముందే నిర్ణయించుకున్నావన్నమాట! నా సంగతి సరేసరి, రఘును ఏంచేద్దామని? మొన్న నువ్వు నిర్మల పెళ్ళికెళ్ళిన రెండు రోజులూ సముదాయించలేకపోయాను. ఒకటే ఏడుపు.''

కఠినంగా సమాధానం చెప్పింది పంకజం. "ఒకరి ఏడుపుకోసం, మరొకరి అయిష్టతకోసం చిన్నచిన్నకోర్కెలనూ, సరదాలనూ కూడ చంపుకొని జీవచ్ఛవంలా బ్రతుకలేను. రఘును అత్తగారు చూచుకుంటారు. లేకపోతే నాలుగైదు రూపాయలకొక నౌఖరు కుర్రాణ్ణి ఏర్పాటు చేస్తాను.''


"వూఁ'' బరువుగా నిట్టూర్చాడు శ్రీధర్. "బిడ్డ విషయంలో తల్లిగా నీ బాధ్యత అంతేనన్నమాట? నువ్వు పారేసే డబ్బుకు నౌఖరైతే వస్తాడుకాని, నీ బాధ్యత, మమత, లాలన లభిస్తాయా బాబుకు వాడిద్వారా ?''

''భర్తా, బిడ్డలే స్వర్గమనుకుంటూ కూర్చోవటానికిదేం పూర్వకాలం కాదు. అయిదారుగురు పిల్లల తల్లులు కూడా ఉద్యోగాలు చేస్తున్నారీ రోజులలో. నేనుద్యోగం చేస్తానంటే బాధపడ్తున్న మీరు, కనీసావసరాలకు కూడా డబ్బడిగి లేదనిపించుకోవడం నాకెంత బాధకలుగజేస్తూందో ఆలోచించలేకపోయారా?''

"వృథాగా తర్కించకు పంకజం. నువ్వు ఉద్యోగం చెయ్యడం నాకెంత మాత్రం యిష్టంలేదు. ఆర్థికంగా ఏమైనా బాధలుంటే ఉద్యోగం చేసినా అర్థముంది, చెయ్యాలి కూడా. కాని ఆలోచించి చూడు మనకేలోటూ లేకుండా గడచిపోతూంది ఇంకా సంసారం పెద్దదై పిల్లలెదిగి వచ్చే సరికి చదువులూ, పెళ్ళిళ్ళూ ఎలాగంటావా? నేను కడ్తూన్న ఇన్సూరెన్సులు అప్పుడు ఆదుకుంటాయి నేనున్నా లేకపోయినా ఏ లోటూ వుండదు ఇక నీకు ఉద్యోగం దేనికి? అనవసర విలాసాలకా అంతేనా ?''

''అనవసర విలాసాలని ఎంత తేలికగా తీసిపారేశారు? ఈ నాగరిక యుగంలో మనుష్యులు వాంఛించేది కేవలం తిండీ, నిద్రేనా? మరే వ్యాపకం అక్కర్లేదా? సంఘంలో బ్రతుకుతున్న మనకు అనేక విధాలుగా యితర ఖర్చులుండవా ? అంతెందుకు? మీ స్నేహితులకు, విలాసాలకు మీరు ఖర్చుపెట్టుకోవటంలేదా?''

"ఎందుకు 'మీ-మా' అంటూ గోరంతలు కొండంతలు చేస్తావు? సాగినంత మేరకు యిద్దరం ఖర్చుపెడ్తూనే వున్నాం నువ్వూ-నీ ఖర్చూ అంటూ నిన్ను నేను




తేడాగా చూడటంలేదు. పరిస్థితులకు అనుగుణంగా సర్దుకొమ్మంటున్నాను. నేను ఎన్ని అవసరాలు మానుకొంటానో నీకేం తెల్సు? కాని పైకి చెప్పి బాధపడి అందర్నీ బాధపెట్టను. ఈ భూమిమీద పుట్టిన మానవులందరకూ యేదో లోపం, బాధా వుంటూనే వుంటాయి. దైవకృప వల్ల మనకున్న ఆర్థిక లోపం అంతగా విచారించవలసింది కాదు. మిగిలిన అన్ని విషయాలలోను ఎంతో హాయిగా, సంతృప్తిగా గడచిపోతోంది అంచేత సంతోషంగా వుండు ఏ దిగులూ పెట్టుకోకు. నా శక్తిమేరకు నీకేలోపం రానివ్వను.''

''ఇవన్నీ నేనాలోచించకపోలేదు. డబ్బు అవసరమై చేతిలో విద్య వుండీ ఎందుకు చేతులు ముడుచుక్కూర్చోవాలి?''

కుర్చీలో పడుకున్న శ్రీధర్ లేచి తిన్నగా కూర్చున్నాడు "చూడు పంకజం! అది నువ్వు చిన్న విషయంగా మాట్లాడుతున్నావు కాని అందులో ఎన్ని సాధక బాధకా లుంటాయో, ఒక్క ఆర్థిక సమస్యను తీర్చే ఆ స్త్రీ ఉద్యోగం ఎన్ని ఇతర సమస్యలను నెత్తిన రుద్దుతుందో నువ్వాలోచించటంలేదు. జీతంకట్టి, వెయ్యిమంది మగవాళ్ళున్న కాలేజీలో చదువుకోవటం వేరు; జీతం అందుకోటానికి పదిమంది పురుషుల మధ్య కూర్చుని స్త్రీ ఒక అధికారిక్రింద పనిచేయటం వేరు.

ఎంత ప్రగతి సాధించామనుకొన్నా, పది మందిలో తిరిగే స్త్రీని గౌరవ మర్యాదలతో చూడగల సంస్కార మందుకోలేదు యింకా మన దేశం. ఇదొక సంధి యుగం. అటు 'ప్రాత' పూర్తిగా వద ల్లేదు—ఇటు క్రొత్త పూర్తిగా జీర్ణం కాలేదు. ఈ పాతక్రొత్తల మేళవింపు వల్లనే అనేక సమస్యలు తలెత్తు తున్నాయి. అయినా మనం ఆపలేం. ఒకనాటికి ఆ పరిస్థితులూ వచ్చి తీర తాయి హిందూదేశం సాటి దేశాలతో సరితూగిందని గర్విస్తారు. కాని అతి పురాతనమైన, అతి విలువైన కుటుంబ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుంది. స్త్రీ పురుష లిరువురికీ విద్య వుంటుంది. ఇద్దరూ ఉద్యోగాలు చేస్తారు. సంతానా లకు 'నర్సరీ'లుంటాయి, వృద్ధుల ఆలన పాలనలకు కూడా సంస్థలు నెలకొం టాయి. మనుష్యులు కూడా యాంత్రికంగా మారిపోతారు తల్లీ బిడ్డలమధ్య, భార్యా భర్తలమధ్య ఉండే అహ్లాద మధుర పూరిత సంబంధ బాంధవ్యాలు సమసి పోతాయి. కుటుంబాలలో నిండుదనం తొణకిపోతుంది. ఇప్పటికే ఇటువంటి దేశాలు కొన్ని వున్నాయి. స్త్రీ పురుష లిరువురూ శ్రమిస్తారు. భోజనశాలలు, పిల్లల నర్సరీలు, వృద్ధుల సంక్షేమనిల యాలు వుంటాయి ప్రభుత్వమే నడుపు తుంది వాటిని. గృహిణికి వంటబాధ్యత లేదు. తల్లి పిల్లలను సాక నవసరంలేదు. యువతరం వృద్ధులకు సేవచేయ నవసరం లేదు. స్త్రీ, పురుషుడు యిద్దరూసమానమే. ఇద్దరికీ సంపూర్ణ స్వేచ్ఛ !

"వింటున్నావా పంకజం ఎలాగుం దిదినీకు ? ఎవరి కెలాగున్నా మారుతున్న ప్రపంచంలో మార్పులుతప్పవు. ఒక నాటికి రామాయణ భారతాల ప్రసక్తే వుండదు. సీతా సావిత్రుల నామాలే ఎవరికీ తెలియవు ప్చ్ ! నిస్సహాయులం ! కాని భవిష్యత్‌లో రాబోయే ఆ ఘోరసంచల నానికీ, విపరీతానికీ మనమే ఎందుకు నాందీగీత మాలాపించాలి ? ఆలపించిన వారిలో ఒకరం ఎందుకుకావాలి ? ప్రథమ బాధితులలో ఒకరి మెందుకవ్వాలి ? నిర్మ లంగావున్న ఈ సంసార సుఖశాంతులను చెదరగొట్టకు పంకజం. బాగా ఆలో చించు.''

విని విని నిర్లిప్తంగా సమాధాన మిచ్చింది పంకజం. "నలకను కూడా భూతద్దంలోచూపి భయపెట్టడం మీకు బాగావచ్చు నేనొక్క_తెను కట్టుబడి వున్నంతమాత్రాన వచ్చేమార్పు లాగి పోతాయా ? నేను ఉద్యోగంచేయటానికే నిశ్చయించుకున్నాను'' సంభాషణ ముగించేసి వెళ్ళి పడుకుంది

తనలోతను అనుకుంటున్నట్టుగా అన్నాడు శ్రీధర్ "అర్థం చేసుకో ప్రయత్నించిన వాళ్ళకు చెప్పగలంగానీ విలక్షణంగా ఆలోచించేవాళ్ళకు నచ్చ చెప్పేదెలా ? కాసీయ్, కొన్నికొన్ని

విషయాలను అనుభవాలే తెలియ జెప్పాలి.''

## 3

ఆదివారం మధ్నాహ్నం, కాలేజీలో లెక్చరర్‌గా పనిజేస్తున్న సుమతి యింటికి బయల్దేరింది పంకజం. ఆ యిద్దరూ యింటర్మీడియేట్‌లో సహాధ్యాయులు; స్నేహితులుకూడా.

''సుమతి యింటిదగ్గర లేదమ్మా ప్రైవేటుక్లాసు పెట్టిందిట. కాలేజీకి వెళ్ళింది'' సుమతి ముసలితల్లి మూలుగుతూ చెప్పింది. ఆవిడ ఎనభై యేళ్ళ వృద్ధురాలు.

"నాకా కళ్ళుకనిపించవు, ఏపనీచేయగల ఓపికలేదు. ఇటు నాకు చాకిరీ చేస్తూ అటు పిల్లల్ని చూసుకుంటూ, ఆ కాలేజీలో నానా యాతనాపడి డబ్బు సంపాదిస్తోంది. ఆదివారంకూడా ఖాళీలేదు. ఇంట్లో పిల్లలందరికీ జ్వరాలు.అదొచ్చేవరకూవాళ్ళకు మంచినీళ్ళిచ్చే గతికూడాలేదు. దేవుడెన్ని పాట్లు రాశాడు?" కళ్ళొత్తుకుంటూ చెప్పింది ముసలామె.

సానుభూతితో యిల్లంతా కలియ జూచింది పంకజం. సుమతి పిల్లలు నలుగురూ రోగాలతో మంచాలమీద పడి వున్నారు. ఇల్లంతా చీదరగా తుక్కుతో, మాసినబట్టలతో, గలీజుగావుంది. ఒక పిల్లవాడు అదేపనిగా 'అమ్మా', 'అయ్యో' అంటూ మూల్గుతున్నాడు. పంకజం దగ్గర కెళ్ళిచూచింది, ఒళ్లుకాలిపోతోంది. మరో పిల్ల ఎందుకో తనలో తనే క్రుళ్ళి క్రుళ్ళి ఏడుస్తోంది, పంకజం అడిగితే ''కాఫీ కావాలి. అమ్మవచ్చేవరకూ ఎవరిస్తారు?" అంది మరింత వెక్కెక్కిపడ్తూ.

పంకజం మనస్సు జాలితో కరగిపోయి కండ్లలో నీళ్ళునిలిచాయి. పాపం, సుమతి భర్త కలరాతగిలి చనిపోయాడు అదృష్ట వశాత్తు సుమతికి చదువుంది. అదికూడ లేకపోతే యింకా ఎన్నిబాధలు పడుదురో! కాఫీకాచి, పిల్లలకూ, ముసలమ్మకూ యిచ్చి, ఇల్లు శుభ్రంగాసర్ది సుమతికోసం చూస్తూకూర్చుంది పంకజం. నాలుగు స్నరకు సుమతివచ్చింది వుస్సురను కుంటూ. వస్తూనే పిల్లల పక్కదగ్గరకెళ్ళి ఒక్కొక్కళ్ళనే చూచుకుంది టెంపరేచర్ చూచి, ఏంకావాలో అడిగింది. "పంకజంపిన్ని యిచ్చారు కాఫీ." అని చెప్పాడు కాస్త జ్ఞానంవున్న పదేళ్ళ పిల్లవాడు.

"నీకూ్కడా వుంది, ఆ ఫ్లాస్కులో, తీసుకో" అంది పంకజం.

"థాంక్స్! దా, యిద్దరం తీసుకుందాం," అంటూ సుమతి పంకజం ప్రక్కనకూర్చుంది

"చూస్తున్నావా నా అవస్త? ఆయన వున్నన్నాళ్ళూ ఎంతసౌఖ్యంగా గడచిపోయిందో అన్నిపాట్లూ పడుతున్నాను దేవుడికి నాపై దయలేదు. ఈ పిల్లల్ని

చూచుకోవాలి. చచ్చేలా చాకిరీ చేసుకోవాలి. అట్టు కాలేజీలో చచ్చేట్టు అరిచి అరిచి పాఠంచెప్పాలి అదైనామర్యాదగానా? ఒకడు కుక్కకూత, మరొకడు గాడిద అరుపు, ఇంకొకడు యికిలించడం, ఒక్క అవస్థకాదు. పరీక్షలు దగ్గరకొస్తున్నాయి, 'కోర్సు' అవ్వలేదని మొన్న 'చీఫ్' పిల్చి వ్యాఖ్యానించాడు. ఏదో ఒక అల్లరి, అర్భాటంచేస్తూ ఈ స్టూడెంట్సు 'కోర్సు' అవనివ్వరు. పాఠంజరుగదు. వాళ్ళను గట్టిగా ఏమైనాఅంటే 'స్ట్రైక్'లు. దాన్తో యిటు స్టూడెంట్సుకూ లోకువే, అటు లెక్చరర్స్‌కూ లోకువే. గతిలేక చెయ్యడంకానీ — లెక్చరర్, ప్రొఫెసర్, ఆఫీసర్ అంటూ పెద్ద గంభీరంగా వినిపిస్తాయి ఈ ఉద్యోగాలు నిజానికి అవన్నీ ఒకరకం కూలిపనులే ... ఈ పిల్లలంతా ఫ్లూ జ్వరంతో పడివున్నారు. వేరే చూచే దక్షత లేదు. అయినా చచ్చినట్టు ప్రైవేటు క్లాసుపెట్టి చెప్పి వచ్చాను. ఇప్పుడు వచ్చానా? ఆస్పత్రికిపోయి మందుతేవాలి. బజారుకుపోయి యేమైనా పళ్ళూ, కూరలూ తెచ్చుకోవాలి, ఇంటికొచ్చిమళ్ళీ యింటెడుచాకిరీ చేసుకోవాలి. తెల్లారి కాలేజీలో కోతులకు చెప్పబోయే పాఠం కాస్త చూచుకోవాలి. ఖర్మ." మొఖం కొట్టుకుంది సుమతి. పంకజం చూడకుండా అటుతిరిగి కళ్ళు తుడుచుకుంది.

"ఈ పిల్లలు కాస్త ఎదిగివచ్చేదెప్పుడో, నాపాట్లు తీరేదెప్పుడో?" గాద్గదికంగా అంది.

"పోనీ ఒక వంటమనిషిని పెట్టుకొంటే?" అడిగింది పంకజం.

"ఆ సౌభాగ్యమూ అయ్యింది. ఒక రాత్రి యింట్లో నెల్లాళ్ళపాటు వచ్చేసరుకులన్నీ వారంరోజులకే అయిపోయా యనేది. ఇంటికి పట్టుకుపోయేదో, దూబరాచేసేదో తెలియదు. మరొకడు రెండ్రోజులుచేసి రేడియోపట్టుకు చక్కాపోయాడు. ఇక హడలిపోయి వంటవాళ్ళ పేరెత్తడం మానేశాను."

కొంచంసేపు కూర్చుని వెళ్ళిపోయింది పంకజం. సుమతి ద్వారా ఉద్యోగప్రయత్నం చేద్దామనుకొన్న ఆమె ఉద్దేశ్యం, సుమతి కుటుంబస్థితి కళ్ళారా చూచాక, సుమతి కష్టసుఖాలన్నీ చెవులారావిన్నాక, మనసులోనే సమాధి అయిపోయింది.

"సుమతి యేమైనా ఉద్యోగ మిప్పిస్తానందా?" అనడిగాడు శ్రీధర్ రాత్రి.

"నేనందుకు వెళ్ళలేదు," అంది పంకజం ముక్తసరిగా.

## 4

"దీపావళికి రమ్మని మామగారుత్తరం వ్రాశారు" అని లెటరు అందిచ్చాడు ఒకరోజు శ్రీధర్.

అందుకొని ఆత్రతగా చదువుకుంది పంకజం. "పండక్కి మా పెద్దచెల్లెలు



'మా ఆవిడని కారు పార్కు చేసినందుకు అరెస్టు చేశారు'
'కారు పార్కు చేసినందుకా ?!!!'
'అవును ఇంకో కారుమీద పార్కు చేసిందట'

కూడా వస్తోందిట. మరెప్పుడు వెళ్దాం ? వారంరోజులే వుంది." అంది ఒకవిధమైన వుత్సాహంతో.

అందుకుసమాధానం అత్తగారినుంచి వచ్చింది, "ఈ మధ్యనేగా చెల్లెలిపెళ్ళికి వెళ్ళి నెల్లాళ్ళుండి వచ్చావు ? పుట్టింట్లోనే కాదు పండగ, ఇక్కడావుంది. ఓ సారి స్నేహితురాలిపెళ్ళి, మరోసారి చెల్లెలి పెళ్ళి, ఇంకోసారి పండగ అంటూ తిరగడమేనేమిటి అస్తమానూ ?"

శ్రీధర్ మెల్లగాలేచి వెళ్ళిపోయాడు "ఆఫీసు టైమైంది'' అంటూ.

ఛర్రున కోపంవచ్చింది పంకజానికి. "ప్రతిదానికీ అందరిసలహాలూ అవసరం.నా పుట్టింటికినేను వెళ్ళడానికి ఇంకా నీతిబోధలేనా ?"

జయమ్మ ఆసలేముక్కోపి. "ఒక్క దీపావళికేం?పోయి శాశ్వతంగా అక్కడే పడుండు." అని దర్జాగా అక్కడినుంచి లేచి వెళ్ళిపోయింది.

పంకజంముఖం కోపంతో జేవురించింది. సుడిగాలిలా వెళ్ళింది భర్తగదిలోకి. తలదువ్వుకుంటున్న శ్రీధర్ అద్దంలో భార్యప్రతిబింబం చూచికూడ చూడనట్లే వూరుకున్నాడు.

"ఇంకొక్క క్షణముండనీయింట్లో." ఒక్క గావుకేకపెట్టింది పంకజం.

గమనించనట్లే పైకట్టుకోసాగాడు శ్రీధర్.

"మీకే చెప్పేది. వినపడటంలేదూ?" ఉడుకుమోత్తనంగా అరిచింది తిరిగి.

"ఏమిటీ?" అన్నాడు శ్రీధర్ తల త్రిప్పకుండానే తాపీగా. అద్దంలో చూస్తూనే వున్నాడు ఆమె రౌద్రాకారం.

''ఏమిటట ఏమిటి! ఏమీఎరుగనట్టు! పండక్కు పుట్టింటికి వెళ్తానంటే శాశ్వతంగా పుట్టింట్లోనే వుండమనే మని షెక్కడా వుండదు. నాకేం బెదరింపా? మహారాణీలావుంటాను. ఈ దరిద్రమూ తప్పుతుంది. నన్ను భరించలేనంత బీదది కాదు నా పుట్టిల్లు.''

"తప్పు తప్పు. బీదయింట్లో దానవైతే నన్నెలా కొనుక్కుంటావు యిన్నివేలు పోసి? తర్వాత ఆలోచిద్దాం కాని. భోజనం చేద్దాం నడు. ఆకలి జాస్తైనకొద్దీ తెలివినాస్తిట. ఇంకా భోజనం పడక మాంచి జోరుగావుంది ధోరణి.'' భార్య చెయ్యి పట్టుకున్నాడు నవ్వుతూ.

"నేనురాను,'' చెయ్యి విదలించుకుని వెళ్ళి పెట్టె సర్దుకోసాగింది.

"కోపంగావున్నా అందంగానే ఉన్నావుసుమా. నీకు సత్యభామపేరు పెట్టవలసిందసలు." నవ్వుతూ నవ్వుతూ పరిస్థితి తేల్చెయ్యజూచాడు శ్రీధర్. కాని పంకజం ఆ హాస్యమేమీ పట్టించుకోలేదు. "వెంకమ్మా, చాకలింటికెళ్ళి బట్టలుతికినా సరే, లేకున్నా సరే పట్టించుకొచ్చెయ్యి." అని పనిమనిషి కాజ్ఞాపించింది.

పరిస్థితి విషమించిందని గ్రహించాడు శ్రీధర్. దగ్గరకూర్చుని బ్రతిమాల్తున్న ధోరణిలో అన్నాడు. "చూడుపంకజం, ఏమిటీ తొందరపాటు? వయస్సధికమైన కొలదీ ఛాదస్తులౌతారు, నీకు ఆవిడతో వాదమెందుకూ? వెళ్ళాలనిఉంటే నేను పంపనూ?''

"చాలా సంతోషం. నాకు మీ అధికారాలూవద్దు, మీదయా ధర్మాలూవద్దు. నాలుగేళ్ళు భరించాను. ఇక నావల్లకాదు. నాదారి నన్ను చూచుకో వీయండి.''పెట్టె సర్దుకుంటూనే స్థిరంగా అంది పంకజం.

"సరే నీ యిష్టం. ప్రస్తుతం ఏం చెప్పినా వినేట్టులేవు" ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

పదకొండు గంటలకు ఆఫీస్ ప్యూన్ వచ్చి ఒక కవరిచ్చాడు పంకజానికి 'అయ్యగారిమ్మన్నా'రంటూ. అప్పటికామె ప్రయాణానికి సిద్ధమైపోయి రఘును ముస్తాబుచేస్తోంది! కవరు విప్పింది. అయిదు పదిరూపాయలనోట్లు! ఎవరిదగ్గరో బదులుతీసుకు పంపించా

దన్నమాట ! ఈపని ముందేచేస్తే ఎంత బాగుండును ! ఇప్పుడెందుకు ?

"మిమల్ని రైలుకుపంపి రమ్మన్నా రండి.'' అన్నాడు బంట్రోతు.

"అవసరంలేదు నువ్వు వెళ్ళొచ్చు. ఈ కవరుకూడ వారికే యిచ్చెయ్యి." వాడు నిర్ఘాంతపోతూ వెళ్ళిపోయాడు.

'వీధిలో జట్కానిల్చుంది, పెట్టెలు బండిలోకెక్కుతున్నాయి. అంతలో రిక్షాలో దిగాడు శ్రీధర్. జయమ్మ మనస్సుకాస్త కుదుటపడింది. స్లిప్పర్సు తొడుక్కుంటున్న పంకజం కళ్ళు గర్వంగా మెరిశాయి తనపట్ల అతడికున్న విధేయతకు.

"ఇలా నిల్చున్నపాళాన ప్రయాణమైంది. కోపగించిందా ?" అడిగింది జయమ్మ కొడుకును.

"అబ్బే. లేదమ్మా. నేనే పంపిస్తున్నాను. పోనీ పండగని వాళ్లు రాశారు కదా. పదిరోజులుండి వస్తుంది" సర్ది చెప్పేశాడు.

ఆ మాటలువిన్న పంకజం కొద్దిగా బాధపడింది. "ఇంతఉత్తముడిమాటనా పెడచెవినిపెట్టి పోతున్నాను ?'' వేస్తున్న కాలు వెనుకకు తీసుకుంది.

"ఏం, రెడీయేనా ?"అన్నాడు శ్రీధర్ భార్యనుద్దేశించి. కరుగుతూ కరుగుతూ వున్న పంకజం మనస్సు మళ్ళీ బిగిసిపోయింది. "ఆ.'' అంది పెడసరంగా. వెళ్ళిబండెక్కి కూర్చుంది. మనవడిని అందిస్తూ "బిడ్డ జాగ్రత్తమ్మా. వేళాపాళా నీళ్లూ పాలూ చూస్తూండు.'' అంది జయమ్మ. పంకజం మాట్లాడలేదు. వెళ్తున్నట్టు చెప్పలేదు.

వెయిటింగ్ రూమ్‌లో కూర్చోబెట్టి టిక్కెట్లుకొని టిఫిన్, కాఫీ పట్టించు కొచ్చాడు శ్రీధర్. చేతిలోనున్న చామంతిదండ అందివ్వబోయాడు. 'అక్కర్లే'దంటూ ముఖం త్రిప్పుకుంది పంకజం. లోలోపల మహాకష్టంగా వుంది శ్రీధర్‌కు. కాని పైకి చాల శాంతంగా నవ్వుతూనే ఉన్నాడు. పువ్వులు బలవంతంగా జడలోపెట్టాడు. కాని కాఫీ మాత్రం ఎంత ప్రయత్నించినా త్రాగించలేకపోయాడు.

"ఫ్యాన్‌ను పొమ్మన్నావని నేను వచ్చాను.'' అన్నాడు సంభాషణ ప్రారంభిస్తూ.

పంకజం ఏమీ అనలేదు. ముఖం మాత్రం చంద్రకాంతలాగుంది.

"పెట్టెతాళం ఒకసారిస్తావా ?'' అడిగాడు.

"ఓ, చూచుకోండి. మీవేం తీసుకుపోవడంలేదు.'' తాళంయిచ్చి బాత్ రూమ్‌లో కెళ్ళిపోయింది కాని ఆసమయంలో అతడివదనం గనుక చూచి వుంటే అదరిపోయేదే. ఆమెతిరిగి వచ్చేసరికి పెట్టెమూసి తాళం బిగిస్తున్నాడు శ్రీధర్.

ట్రెయినెక్కించి, క్రింద నిల్చున్నాడు శ్రీధర్ పర్సులోంచి యాభై రూపాయలు తీసి "ఇవివుంచు, తర్వాత యింకా పంపిస్తాను," అన్నాడు. ఆమె చెయ్యి చాపలేదు, తీసుకోలేదు.

"అసలింక నేను అక్కర్లేదా పంకజం? పూర్తిగా తెగతెంపులు చేసుకు వెళ్తున్నావా?" పంకజం మాట్లాడలేదు. అప్పటికే కంపార్ట్‌మెంటులో అందరి దృష్టినీ ఆకర్షించారు. 'చక్కటి ఈడూ, జోడూ' అంటోంది ఓ ముసలమ్మ. ఇక విసుగనిపించింది శ్రీధర్‌కు. "పంకజం, పండక్కి వెళ్తున్నావ్, అంతే. ఎన్నాళ్ళుండాలనుంటే అన్నాళ్లూ వుండిరా. మరోభావంగాని, కోపంగానీ పెట్టుకోకు. మరోనెలైనాసరే, ఏడాదికైనాసరే లేక రేపే అయినాసరే — రావాలన్పించగానే నిస్సంకోచంగా రా. నీకోసం, రఘు కోసమే ఎదురుచూస్తుంటాను." డబ్బు రఘు షర్టుజేబులోవుంచి త్వర త్వరగా వెళ్ళిపోయాడు.

## 5

"అల్లుడుగారు రాలేదమ్మా పంకజం?"

"బావరాలేదేం చెల్లాయ్?" "బావేడి అక్కయ్యా?"

"అన్నగారు రాలేదటమ్మా పంకజం?" గుమ్మంలో అడుగుపెట్టాం డగానే తల్లీ, వదినా, అన్నా, తమ్ముడూ— అందరూ అదేప్రశ్న. వివాహమైనది మొదలు యింతవరకు అతడెప్పుడూ పంకజాన్ని ఒంటిగా పంపలేదుమరి!

"సెలవు దొరకలేదు" తెచ్చిపెట్టు కున్న నవ్వుతో సమాధానమిచ్చింది. "నా రాకకు ప్రాముఖ్యంలేదు. ఆయనెందుకు రాలేదో కావాలి అందరకూ" లోలోన విసుక్కుంది.

ఆ సాయంత్రం గదిలో పడుకున్న పంకజం దగ్గరకువచ్చి "నాన్నకావాలి" అని ఏడ్వసాగాడు రఘు. పంకజం అభిమానం మరింత దెబ్బతింది. "ఈ వెధవకూడా ఆయనేకావాలి, నేనక్కర్లేదు." అనుకొని అలాగే పడుకొంది లేవకుండా. ఏమిటో మనస్సంతా వికలంగావుంది. అది భయమూకాదు. విచారమూకాదు. పంకజం వదిన లక్ష్మి వచ్చింది గదిలోకి. రఘును ఎత్తుకొని వూరుకోబెట్టి, నౌఖరుకిచ్చి మళ్లీ వచ్చింది. "ఇంకా యిలా పడుకున్నావేమిటమ్మా? మీ అన్నయ్య సినిమా ప్రోగ్రాం వేస్తేనూ?" అంతలో అన్నయ్య శేఖరం కూడా రానేవచ్చాడు. "లే లే అట్టే టైము లేదు." జబర్దస్తీగా అన్నాడు. "మళ్లీ మేము రేపు సపత్నీకంగా అత్తారింటికి దయచెయ్యబోతున్నాం."

ప్రక్కవరండాలో పేపరు చదువుకుం టూన్న అనంతయ్య అన్నాడు కూతుర్ని ఉద్దేశించి. "వెళ్ళమ్మా పంకజం. మళ్ళీ నువ్వు వెళ్ళేలోగా వాళ్ళువస్తారో రారో!

సర్దాగా వెళ్ళండి రఘును నాతో షికారుకు తీసుకెళ్తాన్లే."

ఇక తప్పేటట్టులేదని బలవంతంగా లేచింది పంకజం రఘును ముస్తాబు చెయ్యబోతూంటే "వాడి సంగతి నేను చూచుకుంటానులె''మ్మని తల్లి తీసుకు పోయింది. పంకజంహృదయం గర్వంగా నాట్యంచేసింది. ''ఎక్కడైనా నేలను నడవనిస్తేనా ? అత్తింటికీ పుట్టింటికీ ఎంతతేడా ! భర్తా, అత్తగారూవచ్చి కాళ్లు పట్టుకునేవరకూ వెళ్ళకూడ"దనుకొంది.

సినిమానుంచి తిరిగి వచ్చేటప్పటికి రఘు అమ్మమ్మపక్కలో పడుకొని నిశ్చింతగా నిద్రపోతున్నాడు. లేవదీయ బోతూంటే "వుండనీఅమ్మా, అక్క డెలాగూ తప్పదు. ఈ నాల్గురోజులైనా కాస్తసుఖంగా నిద్రపో'' అంది తల్లి. తృప్తిగా తన ప్రక్క మీద వాలింది పంకజం,

మర్నాడుదయమే లక్ష్మి, శేఖరం వెళ్ళి పోయారు మధ్యాహ్నం ట్రెయినులో అనూరాధా, ఆదినారాయణా దిగారు. వస్తూనే అక్కను కౌగలించుకుంది అనూ రాధ.

సహజంగా పంకజం అనూరాధకంటె అందమైనదైనప్పటికీ, ఇప్పుడు అక్క కంటె అనూరాధే అందంగా, షోగ్గా వుంది. ఖరీదైన షిఫాన్ చీర, ఫాషన్ కత్తిరింపుల జాకెట్టూ, అందమైన హెయిర్ స్టయిల్, కాళ్ళకు చెమ్కీపని చెసిన కాన్పూరు స్లిప్పర్సు. చేతిలో అందమైన వానిటీబాగ్ చూచేప్పటికి కొంచెం ఈర్ష్యకలిగింది పంకజానికి "దానికేంతక్కువ ? ఢిల్లీలో కాపురం. గెజిటెడ్ ఆఫీసర్ భార్య అత్తా, ఆడు పాడ్డలూలేని స్వతంత్రం. అలాగుండాలి జీవితమంటే '' అనుకొంది. 'నన్ను బీదవాళ్ళకు, మామూలు ఉద్యోగస్థుడికి చేశారు నాన్నగారు'' అని కొంచం కోపంకూడా వచ్చింది.

## 6

తెల్లవారితే పండుగ. ఆరాత్రిభోజనాల దగ్గర అనంతయ్యగా రన్నారు. ''శ్రీధర్ కూడావస్తే ఈ నాల్గురోజులూ కళ కళ లాడుతూండునిల్లు. ఎంచేతోరాలేదు ''

"అవునవును, మీక్కావలసినవి కళ కళలు, మాక్కావలసినవి గలగల లూను.'' అన్నాడు ఆదినార్యాయణ.

''అబ్బే. అతడటువంటివాడు కాదు. చాలా ఉత్తముడు. ఈ కాలంలో అటు వంటి మనిషి నెక్కడా చూడం...'' అనంతయ్య యింకా యేమేమో అంటూనే వున్నాడు.

"ఓహో !" అంటూ చెయ్యికడుక్కు వెళ్ళిపోయాడు ఆదినారాయణ.

"అతడసలే కోపిష్టిమనిషట. ఎవరి దగ్గరైనా మరీ - మీధోరణేమిటి." విసు క్కొంది సీతమ్మ.

'అలాగా ! మరీ, ఈ నాల్గురోజుల నుంచీ చూస్తూనేవున్నాను. ఒక్కడూ

ఆ గదిలోనే చూర్చుంటాడు. ఎవరితోనూ ఓమాటా మంచీలేదు. అయితే అత డెప్పుడూ అంతేనా అనూరాధా? ఇంకా మంచివాడే అని మురుస్తున్నాను నేను. పెళ్ళవ్వగానే వెళ్ళిపోయావు. నీ సంసారం సంగతేమీ నాకు తెలియదమ్మా." ఖంగారుగా అడిగాడు అనంతయ్య పేలవంగా నవ్వివూరుకుంది అనూరాధ. "ఊరుకుందురూ, అతడువింటే మళ్ళీ అదో రభస." అంది సీతమ్మ. ఈ వారం రోజుల్నుండీ "ఇది జలంధర్ నుంచి తెచ్చారు. అది పాట్నానుండి తెప్పించారు" అంటూ చెల్లెలు ధరించేనగల్నీ, దుస్తుల్నీ చూచి ఓ ప్రక్క మురిసిపోతూ ఓ ప్రక్క ఈర్ష్యపడ్తున్న పంకజానికిదంతా అయోమయంగా వుంది.

రాత్రి పడుకోవటానికి తనగదిలోకి వెళ్తూన్న పంకజానికి అప్రయత్నంగా అనూ, ఆదినారాయణల సంభాషణ విన వచ్చింది.

"పండగ రేపేకదా, రేపు రాత్రి ట్రెయినుకు రెడీగావుండు."

"............"

"ఓసిమొద్దూ, నిద్రపోయావేమిటే అప్పుడే?"

"లేదు. వింటున్నా." అనూరాధ సన్నవిగొంతు.

"వినికూడ సమాధానంలేదు. పుట్టిల్లనేమిటి భరోసా?"

"కాదండీ. నా కింకో నాల్గురోజులుండాలనుంది అసలు పండగంతా ఎల్లుండి కదా?" బెదుర్తున్నట్లుంది అనూరాధ కంఠస్వరం.

"అవతల మన చుట్టమెవడూ లేడు సెలవివ్వడానికి"

"పోనీ మీరు వెళ్ళకూడదా?"

"ఏమిటే!" అది మాటకాదు; అంకె: "నేను లేకపోతే విచ్చల విడిగా తిరుగుదామనా? వీల్లేదు. రేపు వెళ్ళి తీరాలి. చచ్చితీరాలి."

ఇక వినాలన్పించలేదు పంకజానికి. అసహ్యించుకుంటూ త్వరత్వరగా వెళ్ళిపోయింది. పడుకోవడమే కాని పంకజకు నిద్రపట్టలేదు. "శౌరారా 'పంకజా' అని తీయగా ప్రేమగా పిల్చే తన భర్తకూ యితడికీ ఎంతతేడా! భర్తముందు నోరు మెదపడానికే జడుస్తోంది అనూరాధ. తానెంత కోపగించుకున్నా, విసుక్కున్నా సరే విడువకుండా కూడా కూడా తిరిగే భర్తను అలా చులకనజేసి వచ్చేయడంలో పొరపాటేమైనా జరిగిందా?" వచ్చిన తర్వాత వారం రోజులకు ఖువ్వాళ మొదటి సారిగా తన ప్రవర్తనను పునశ్చరణ చేయ బూనింది. కాని ఆ వెనువెంటనే అభిమానం తలెత్తింది. "నాపిచ్చి కాని, అడుగడుగునా నీతులు వల్లించే వాళ్ళు మంచివాళ్ళా? అంత ప్రేమేవుంటే—నాకు కాకిపోతే, నా తండ్రికైనా ఒక ఉత్తరం వ్రాశారా?"

మర్నాడుదయం తల్లి పిండివంటలు చేసే హడావుడిలో వుంది. అనూరాధ స్నానం చేసి వచ్చి దొడ్లో అరుగు మీద జుట్టు తడి ఆర్చుకుంటూ కూర్చుంది. పంకజం మెల్లగా చెల్లెలిదగ్గర జేరింది

''ఏమిటి అనూ, రాత్రి మీ రిద్దరూ ఘర్షణ పడ్తున్నారు ?''

''ఏంలేదక్కా! ఏముంది ?'' అంది అనూరాధ ఏమీ తెలియనట్టు.

''అయినా అతడంత మోటుగా మాట్లాడతాడేమిటి నీతో? అంత చదివాడు- ఈ కాలంలో కూడ యివేం పిలుపులు 'యేమే' 'ఒసే' అని ? భార్యను పేరుతో పిల్చుకోవడం కూడా తెలియనంత అనాగరికుడా ?''

గ్రుచ్చిగ్రుచ్చి అడుగుతూంటే యింకా మౌనంగా వుండలేక పోయింది అనూరాధ. ''ఏం చెప్పనక్కా- నా దురదృష్టం. పెళ్ళై వెళ్ళిన ఈ ఏడాదినుంచీ నిన్నూ బావనూ, మీ అనురాగాన్నీ తల్చుకు సంతోషించని రోజులేదు. ఎంత చదివితే నేం, ఏ ఉద్యోగం చేస్తేనేం? సుఖపడడం చేత నవ్వాలి కాని కార్లూ, మేడలూ, నౌకర్లూ వున్నంత మాత్రాన ఆనందం లభించదు. నాపై చెప్పలేనంత అనుమానం. ఎక్కడికీ వెళ్ళకూడదు నేను. ఏ ఆఫీసర్ల పార్టీ అయినా వుండి భార్యను తీసుకు వెళ్ళడం తప్పని సరైనప్పుడు నన్నుకూడా తీసుకు వెళ్తారు. కాని కళ్ళు ఎప్పుడూ నాపై నిఘా. నే నిక్కడికి రాసే వుత్తరాలు తనకు చూపించి మరీ వ్రాయాలి. అడుగడుగునా ధుమ ధుమలాడ్తూనే వుంటారు. మా అత్తగారు దగ్గర లేదన్న మాటేగాని, రెండు మూడు రోజులకో వుత్తరం రాస్తుంటుంది – భార్య నలా అదుపులో పెట్టు, యిలా జాగ్రత్తలో పెట్టు అంటూ.

"నా మనస్సు కెక్కడా సంతోషమే వుండదు. ఇంతోటి బ్రతుకూ ఎలా పడి వుంటేలెమ్మని ఎలాగో ఓలాగుంటే వల్ల కాదు. చలాకీగా కన్పించాలి. సినిమా స్టార్‌లాగా సింగారించుకోవాలి. తనభార్య చదువుకున్నదీ, అందమైనదీ అని అందరిలో తనకు గర్వంగా వుండేట్లు నేనుండాలేకాని, నా మట్టుకు నాకు సంతోషం అక్కర్లేదు." కన్నీళ్ళు ప్రవాహమైపోయింది అనూరాధ.

"ఏమిటమ్మా అది, పండగనాడు?" తండ్రి కంఠం విన్పించి యిద్దరూ ఖంగారుగా లేచారు.

"ఏంలేదు నాన్నా. మళ్ళీ మీ అందర్నీ వదలి పోవడమంటే కష్టంగా వుంది." కళ్ళు తుడుచుకుని బలవంతాన నవ్వింది అనూరాధ.


"పెళ్ళయ్యాక అంతేకదమ్మా మరి? మళ్ళీ సంక్రాంతికి వద్దువుగాని. అల్లుడు గారితో నేను చెప్తానులే" అంటూ వెళ్ళి పోయాడు అనంతయ్య.


"అదేమే, నాన్నతో నీ కష్టసుఖాలు చెప్పుకోకూడదూ?" అడిగింది పంకజం.

"ప్చ్. అటువంటివి చెప్పుకోకూడ దక్కా. అక్కడినుంచీ వాళ్ళ దృష్టంతా మనపైనే పెట్టుకు బాధపడ్తారు. అయినా, అమ్మా నాన్నా జాలి పడ్తారుకాని, అటువంటివి తెలుస్తే వదినకు లోకువై పోనూ? ఎక్కడి వక్కడ మర్చిపోవడం హాయి."

"పిచ్చి సిద్ధాంతాలు" నిరసించింది పంకజం "అలాటి మొండికాపురం నువ్వు గనుక చేస్తున్నావు కాని, నేనైతే వచ్చిపుట్టింట్లోకూర్చుని, మూడు చెరువుల నీళ్ళు త్రాగించి అదుపులోకి తెచ్చి వుందును."

"అంతేనా? నువ్వింకా ఎంతో తెలివైనదానవను





కున్నానే?''  విభ్రాంతపోయింది అనూరాధ.

"అంటే?''చెల్లెలి హేళనకు పంకజం అహం దెబ్బతిన్నది.

"ఇక్కడే వుండేవాళ్ళమైతే పెళ్ళి చేసుకు వెళ్ళడ మనే 'లాంఛనం' కూడా ఎందుకు? చావో, బ్రతుకో, కష్టమో, నిష్ఠురమో– అది నా ఇల్లు, నా సంసారం. ఎంత ఆత్మీయులైనా అన్నీ సవ్యంగా వుంటేనే గౌరవంగా చూస్తారు. కట్టుకొన్న భర్తవద్ద లభించని గౌరవం కన్నతల్లివద్ద కూడా కరువే. ఎన్ని చదువులు చదవనీ, ఎన్ని హక్కులు రానీ ఈ మానసిక జాడ్యాల తగ్గడానికి కిం: కొంతకాలం పడ్తుంది.అం పరకు మనం పాతదారి నడవాలి, భర్తతో తెగతె

పురి చేసుకొచ్చిననాడు, ఈ అమ్మ ఆదరణా, నాన్న ప్రేమా, అన్నయ్య గారాం, వదిన నమ్రతా మచ్చుకైనా కన్పించవు." చివుక్కున లోపలికి వెళ్ళిపోయింది అనూరాధ.

కొయ్యబారిపోయింది పంకజం. అంత హీనంగా చూస్తున్న భర్తే సర్వస్వమంటోంది అనూరాధ! ఆదినారాయణతో పోల్చిచూస్తే తనభర్త దైవస్వరూపుడే అటువంటి వ్యక్తిని చిన్న విషయానికే తాను తూలనాడింది. తాను చేసింది నిశ్చయంగా తెలివితక్కువ పనే. చిన్నదైనా ఎంత తెలివైనది అనూరాధ! అంతలో తల్లి కంఠం విన్పించింది వెనుకనుంచి.

"ఏమే అలా కూర్చున్నావ్ ఎండలో? మీ ఆయన రాలేదనా? ఏంపని తగిలిందో యేమో! పండగకదా- ఆ పిల్లాడిని కాస్త ముస్తాబు చేసుకోకూడదూ?"

"అలాగేలెద్దూ" సిగ్గుపడ్తూ లేచింది పంకజం. రఘును స్నానం చేయించమని నౌకరుకు అప్పగించి, తాను బట్టలు తీయడానికి పెట్టెదగ్గర కూర్చుంది. కూర్చున్నదన్నమాటేకాని మెదడే మీ పనిచేయడంలేదు. అర్ధరహితంగా పెట్టెలో దుస్తులన్నీ అటూఇటూ కెలకడం ప్రారంభించింది. ఆ కెలకటంలో పెట్టె అడుగునవున్న నీలికవరొకటి పైకి వచ్చింది. ఆశ్చర్యపోతూ విప్పి అప్రయత్నంగానే సాంతం చదివింది

డియర్ పంకిజా,

ఆఫీసుకు వచ్చానన్న మాటేకాని ఆలోచనంతా నీ మీదే చాలా ఆలోచించి ఈపని చేస్తున్నాను. ఇప్పుడు నేనేం చెప్పినా వినేటట్టు లేవు అందుచేత నా అభిప్రాయాలన్నీ వ్రాసి నీ పెట్టెలో పెట్టదలచుకున్నాను. బహుశః నీ కోపోద్రేకం తగ్గేసరికి యిది నీ కంట పడగలదు

హిందూ కుటుంబాలలో సర్వసాధారణంగా జరిగేవాటికే నీ కెందుకింత కోపం రావాలో నాకు తెలియడంలేదు. అమ్మ ఏదో సాధిస్తూంటుందనే నీకు కోపంకాని ధనవంతుల పిల్లవు, చదువుకున్నదానవు అని ఏ పనీ చెయ్యనీకుండా భోజనం పెడ్డించి వంటగదిలోకి పిల్చే అత్తగార్లు మన భారతదేశంలో ఎందరున్నారంటావు? ఒక మంచికి - ఒక చెడు, వుంటూనే వుంటుంది మానవ మాత్రులలో; భరించాలి. ఏ స్త్రీకైనాసరే-పుట్టిల్లు కుబేర భవనం కానీ, కుచేల గృహం కానీ- వివాహాత్పూర్వం పుట్టిల్లు వేరు, వివాహానంతరం పుట్టిల్లు వేరు.

నువ్వు అక్కడ పుట్టి పెరిగావు. ఆ బంధాన్ని పురస్కరించుకుని అక్కడ నాల్గురోజులుండి రావల్సిన బంధువులే కాని అక్కడ నీకేమీ అధికారం లేదు. ఇది నీ యిల్లు-నీ అధికారం చెల్లుతుంది ఇహ ఎవరిమీద నీవు కోపగించి వెళ్ళేది? అత్తగార్లు అధికారం చెలాయించడం

ఎక్కడలేదు? అది అధికారం కాదు— అధికారాలు చేతులు మారేటప్పుడు కలిగే సంచలనం జీవితంలో అన్నిసుఖాలూ లభ్యమవ్వడం లేదనీ, ఏదో వెల్తి వుందనీ నీకు అనుమానం కాని ఆలోచించి చూడు నీ అంత అదృష్టవంతులు ప్రపంచంలో బహు స్వల్పం నీకు ఏ లోటూ లేదు, ఒక్క ధనికవర్గపు దర్జాలుతప్ప అది లేదు, ఇది లేదనే అసంతృప్తిని పెంచుకోవడంకంటె వున్నవాని విలువను తెల్సుకొని సంతృప్తి పడడంలో గల సౌఖ్యానికి సాటిలేదు నీకంటె ఎవరో ఎక్కువగా, దర్జాగా వుంటున్నారనీ నీ బాధ. కాని ఏ జీవికీకూడ సంపూర్ణ సౌఖ్యం లేదనీ, ఏవో లోటుపాట్లు వుంటూనే వుంటాయనీ నీవు గుర్తించాలి విద్యావతివైన నీకు దూరపుకొండల నునుపును గూర్చి, ఎండమావులను గూర్చి నేను బోధించనక్కర్లేదు

తీరని కోర్కెలేవో కరడుగట్టి పెద్దవాళ్ళను కఠినాత్ములుగా, ఛాందసులుగా తయారుజేస్తాయి అందువల్ల వారి మాటలను పట్టించుకోకూడదు నీకు ముఖ్యం నేనుగానీ, మా అమ్మకాదు కోపంతో, అభిమానంతో వెళ్ళావు కాని వాటిని కలకాలం నీ మనస్సులో కాపురం చేయనీయకు. ఎప్పుడు రావాలనుంటే అప్పుడు నిస్సంకోచంగా నీ యింటికి నువ్వు రా ఈ గృహద్వారాలూ, నా హృదయద్వారాలూ నీకు సదా సుస్వాగతం పలుకుతుంటాయి

నీ

శ్రీధర్

పంకజం అభిమానం పశ్చాత్తాపంగా మారి దుఃఖరూపం దాల్చింది ఆరోజు స్టేషన్‌లో యిందుకే అతడు పెట్టెతాళం అడిగాడు, తానెంత నీచంగా మాట్లాడింది! అమృతమే అంతరంగంగా, దైవత్వమే ధనబలంగాగల ఈ ప్రేమమూర్తినా తాను అపార్థం చేసుకొన్నది?

"పంకజా!''బయట ఎవరిదో పిలుపు. కళ్ళు తుడుచుకుని చావిడిలోకి వచ్చింది పంకజం చేతిలో కుంకుమ భరిణితో చిన్ననాటి స్నేహితురాలు కమల నిలబడి వుంది. విచారమంతా ఒక్కసారి మరచిపోయి సాదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టింది పంకజం.

"మా అమ్మాయి పుట్టినరోజు నువ్వొచ్చావని తెల్సి వచ్చాను ఏమిటి విశేషాలు?" బొట్టుపెడ్తూ అడిగింది కమల.

నవ్వింది పంకజం "విశేషాలకేం గాని, నువ్వు మరీ యింత సనాతన ముత్తైదువలా మారిపోయావేమిటి? చదువుకొనే రోజుల్లో సినీస్టార్స్‌కు కూడ ఫ్యాషన్స్ నేర్పేట్టుండేదానవు?''

తేలికగా నవ్వేసింది కమల "అవన్నీ ఆ రోజులు. జీవితం మారిందిగా మరి? అంత ఫాషన్‌గా వుండడం మా వారికి

నచ్చదు ఉద్యోగం కూడ మానేశాను ఎంత నవీన యుగమైనా వివాహ జీవితం అన్నాక కొన్నికొన్ని త్యాగాలు, కట్టు బొట్లుతప్పవు మరి ''

''ఉద్యోగం మానేశావా ?'' ఆశ్చ ర్యంగా అడిగింది పంకజం

"అవును పంకజం ఇంత చదువూ చదివి సంసారంలో పడిపోవడ మేమి టని కొన్నాళ్ళు మూర్ఖంగా ఆలోచించే దాన్ని కాని, క్రమంగా అర్థం చేసు కున్నాను ఒక మహా వటవృక్షం వద్ద నిలచి దానికిగల అనేక కొమ్మలలో ఒక కొమ్మనుండి చీలిన చిన్న శాఖయొక్క ఒక పలవలోని ఒక పత్రాన్ని ఆ చెట్టుతో పోల్చిచూస్తే ఎంత అల్పమో-నేటి ఒక విద్యాపట్టం విద్యావృక్షంముందు అంత అల్పమైనది బరువైన పదాలు వాడు న్నానని అనుకోకు ఈ విద్యని తెలివిగా సంసారం చెయ్యడానిక్కూడా వుపయో గించుకోవచ్చు కాని ఉద్యోగమే చెయ్య క్కర్లేదని తెల్సుకున్నాను. భార్యగా, తల్లిగా నా ఉద్యోగం మరచిపోయి ఇంకో ఉద్యోగం దేనికి చెప్పు? నిజానికి నేను ఉద్యోగం చేసినన్నాళ్ళూ సంసారం చిన్న నరకంలా వుండేది నౌకర్ల నిర్ల క్ష్యానికీ, కరకుదనానికీ గురై పిల్లలు విల విల్లాడిపోయేవారు నేను ఉద్యోగం మానేశాక హాయిగా వున్నారు.''

"అయితే అందువల్ల నీకు నిజంగా సుఖంగా, ఆనందంగా వుందా కమలా?"

"సందేహమా ? నన్ను ప్రేమించే భర్త, నా రక్తమాంసాలైన పిల్లలూ-వాళ్ళ సంతోషానందాలు నావి కావా పంక జం? పగలంతా ఆయన ఆఫీసులో శ్రమ పడి వస్తారు కుటుంబం పనిలో నేను శ్రమపడి వుంటాను ఒకరి సాహచర్యంలో ఒకరం - యిద్దరి శ్రమా మర్చిపోవచ్చు కదా? ఇద్దరం ఉద్యోగంచేసి విసుగుతో యింటికి జేరి, ఒకరిపై ఒకరం విసు క్కుని, ఇద్దరి చికాకూ అమాయకులైన పిల్లలమీద చూపడం ఏం బాగుంటుంది చెప్పు? బిడ్డకు గోరుబువ్వ తినిపిస్తూ-

చందమామ రావే అని పాడి ప్రకృతి జ్ఞానగ్రంథంలో ప్రాథమిక పాఠం ప్రారంభించి,

నూకల్నిస్తా, మేకల్ని కాస్తావా ? అని ఆడించడంలో లోకజ్ఞానం పోస్తూ,

ఏ పూర్వపుణ్యమో,

ఏ యోగ బలమో,

వెలసినా వీ వీర పుణ్యదేశాన,

ఈ దేశమున పాప లేదువగరాదూ

జో...జో...... అని జోలపాడి నిద్రబుచ్చడంలో మన జాతి సంస్కృ తినీ, ఔన్నత్యాన్నీ తెలియజెప్తుంది తల్లి తల్లిలేని దురదృష్టవంతుల సంగతి వది లెయ్యి తల్లివుండీ, బిడ్డను ఆ తల్లి ఒడికి దూరం చేయడమంత విచారకర విష యం అదేకాని మరొకటి లేదు తర్వాత తర్వాత క్రమంగా ఎదుగుతూ 'సర స్వతీ నమస్తుభ్యం...ఓం నామః...భూమి

గుండ్రముగా వుండును  పైతాగ్రస్ సిద్ధాంతం ప్రకారము...... షేక్స్పియర్ కావ్యంతో . .ఐన్‌స్టీన్ సిద్ధాంతం ప్రకారము . .' ఈ విధంగా విజ్ఞాన సౌధం మెట్లెక్కుతాడు కాని ఎంత చదవనీ, ఎన్ని పరీక్షలు పాసవనీ, అవన్నీ ఒకెత్తు, తల్లి పెంపకంలో పొందిన బుద్ధిజ్ఞానాలు ఒకెత్తు ఇవన్నీ ఆలోచించే నేను ఉద్యోగం మానేశాను వెళ్తాను మరి ''

విస్మయంతో కమల వెళ్ళినదిక్కే చూస్తూఉండి పోయింది పంకజం విన్న కొద్దీ, చూచినకొద్దీ ఆమె బాధ, పశ్చాత్తాపం ఎక్కువైపోతున్నాయి ప్రతివారి నోటినుండీ ఒకటేమాట ·

పిచ్చుకల కిచకిచలు ఆలోచనలకంతరాయం కల్గించగా దృష్టి అటు త్రిప్పింది చెట్లపై నిర్విచారంగా కొమ్మకొమ్మకూ ఎగుర్తూన్న ఆ పిచ్చుకల జంటను చూస్తూంటే "ఏ బాధా విచారమూ లేని వాటి జీవన మెంత హాయి'' అన్పించింది పంకజానికి అంతలో ప్రక్కింటి పిల్లవాడు వాటిలో ఒకదాన్ని 'కేటిల్ బార్' తో పడగొట్టాడు, మిగిలినవన్నీ భయంతో ఎగిరిపోయాయి, పంకజానికి జ్ఞానోదయమైంది భర్త వ్రాసినట్లుగా తాను మూరపుకొండల నునుపుకే వెర్రెత్తిపోతోంది చరాచర జీవరాసులలో యే ఒక్క ప్రాణికీ సంపూర్ణ సౌఖ్య స్వాతంత్ర్యాలు లేవు!

"నాన్నా ' ఇప్పుడొక ట్రెయిను వుంది నన్ను పంపించెయ్యండి '' అంది తండ్రి గదిలోకి వెళ్ళి

సీతమ్మ ఆశ్చర్యంగా చూచింది. "అమావాస్యపూట వెళ్తావా ?''

తెలివైన అనంతయ్య కూతురి స్థితి చిటికెలో గ్రహించేశాడు "ఎప్పుడైతేనేం, వాళ్ళయింటికి వాళ్ళు వెళ్ళడానికి?'' అని భార్యను ఓదార్చి కూతుర్ని సాగనంపాడు

## 7

పంకజం బండి దిగుతూండగానే శ్రీధర్ చిరునవ్వుతో ఎదురువచ్చి రఘును అందుకున్నాడు "కాళ్ళు కడుక్కోమ్మా ఎప్పుడైభోంచేశావో!''అంటూ జయమ్మ త్వరత్వరగా వడ్డించి, భోజనం చేస్తున్నంతసేపూ దగ్గరే కూర్చుని పుట్టింటివారి యోగక్షేమాలు అడుగుతూనే వుంది పండగనాడే తిరిగి వచ్చిన తనను ఎంత హేళనచేస్తారో అని భయపడిన పంకజం యేమాత్రం కోపంలేని ఆ తల్లీ కొడుకుల ఆదరాభిమానాలకు సిగ్గుతో తల ఎత్తలేకపోయింది ''పండగనాడు యిలా యింత సామాన్యంగా వున్నారేమిటి?" అనడిగింది కడకెలాగో

జయమ్మ నిండుగా నవ్వింది "ఇంటికి దీపంలా నువ్వొచ్చావా మరి ? ఇంక అంతా పండగే·''

శ్రీ ధర్ చిరునవ్వుతో అన్నాడు "మనకెప్పుడు సంతోషంగా వుంటే ఆ నాడే పండగ. ప్రత్యేకంగా పండగేమిటి?''

పంకజం మరింత సిగ్గుపడిపోయింది వారికి తనతోడిదే జీవితమన్నమాట'

జయమ్మ మనుమడితో ఆడుకుంటూ కూర్చుంది పంకజం శ్రీధర్ గదిలోకి వెళ్ళింది. ''నేను చాలా పొరపడ్డాను నన్ను క్షమించండి" అంది తలవంచు కుని నేలపై కూర్చుంటూ

''ఛ' మనలో మనకు క్ష మా ప ణ లేమిటి? అరే, క్రింద కూ ర్చో కు '' ప్రేమతో దగ్గర కూర్చోబెట్టుకున్నాడు శ్రీధర్. ''నీ ఆగ్రహం అణగడానికి అధమం ఆరు నెలలైనా పట్టుందను కున్నాను కాని ఆ రు రో జు లే సరి పోయాయి నేనూ పొరపడ్డానన్నమాట'" అన్నాడు చిలిపిగా

నవ్వేసింది పంకజం "ఇక ఎన్నడూ మీ మనస్సు నొప్పించను ఆడంబరా లకూ అనురాగాలకూ గల తారతమ్యాలు గ్రహించాను'' అంది మెల్లగా

'ఇంటింట ఆనంద దీపావళీ......' రేడియో సన్నగా పాడుతోంది

శ్రీధర్ తృప్తిగా ఊపిరి పీల్చాడు. "నిజంగా నా జీవితంలో మరపురాని సుదినం ఈ రోజు. సంతోష జీవితాని కవసరమైన సంతృప్తి నీలో కల్గింది

భర్త వారించినా వినకుండా పంకజం తన అనుభవాలన్నీ ఏకరువు పెట్టింది.'' "హమ్మయ్య' అంతా మీతో చెప్పేశాక నా హృదయం తేలికైంది'' అంది నవ్వుతూ

అంతా విన్న శ్రీధర్ గంభీరంగా అన్నాడు "నీలాంబరం క్రింద నిర్మల కాసారంలో వికసించిన ఒక్కొక్క పంకజాన్నీ చూచి మురిసిపోతాం. ప్రపంచంలో ఇంతకంటె సుందరతమమైనది ఉన్నదా అని భ్రమిస్తాం ఆ సౌందర్య లావణ్యాలు చూచి కాని అది పంకజంలో పుట్టి గిట్టుతున్న పుష్పం బ హు శః పంకజనితనని ఆ అద్వితీయ కుసుమం- లక్ష్మీ నివాసస్థానమైన ఆ సహస్రదళ కమలం కూడ విచారిస్తుంటుందేమో' అయినా అది భగవద్విలాసం ప్రతి అందం అడుగునా ఒక లోపం, ప్రతి సుఖం వెనుకా ఒక వెత్తి వుంటాయి. సరిపెట్టుకు పోవడంకంటె మార్గంలేదు''

